కథానిక




# ద్రోహి

రవీంద్ర, రాఘవ సన్నిహిత స్నేహితులు. వాళ్ళిద్దరూ ఒకేచోట 'లా' చదివి, 'లా' పట్టాలు అందుకున్నారు. ఇద్దరూ సీనియర్ లాయర్ శ్రీనివాసరావు దగ్గర జూనియర్లుగా చేరారు. కొన్నాళ్ళు అతని దగ్గరే వున్నారు. స్వతంత్రంగా వాళ్ళిద్దరూ ప్రాక్టీసు పెట్టుకోవచ్చునన్న నమ్మకం శ్రీనివాసరావుకి కలిగింది ఇద్దర్నీ పిల్చి ...



మనిషికి శత్రువు స్వార్థమే! ఆ విషయం మనిషి తెల్సుకోడానికి కొంత సమయం పడుతుంది!

## ముద్దం శెట్టి హనుమంతరావు

"మీ ఇరువురి స్నేహానుబంధానికి నేను ఎంతగానో ఆనందిస్తున్నాను. మీరిద్దరూ 'న్యాయవాది' వృత్తిలో తప్పక రాణిస్తారు. అయితే మీరిద్దరూ జంటగా ప్రాక్టీసు చెయ్యడంకంటే, విడివిడిగా ప్రాక్టీసు పెట్టుకుంటేనే శ్రేయస్కరం. అప్పుడు మీ స్నేహానికి మచ్చగా మీ మధ్య మనస్పర్థలు వచ్చే అవకాశం వుండదు. మీ వృత్తిలో ఎన్నో విజయాలు సాధించాలని మనసావాచా ఆకాంక్షిస్తున్నాను" అన్నాడు ఓరోజు.

రవీంద్ర, రాఘవ శ్రీనివాసరావుగారికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఆయన సలహా ఇచ్చినట్టే ఇద్దరూ విడిగా ప్రాక్టీసు పెట్టుకున్నారు.

** ** **

రవీంద్ర సహృదయుడు, మానవతా దృక్పథం గలవాడు, స్నేహశీలి. కేవలం డబ్బే పరమావధి కాదతనికి.

రాఘవ విషయానికొస్తే అతనూ స్నేహానికి విలువిచ్చేవాడే. కాని అతనిలో ఎక్కడో స్వార్థపుచింత దాగి వుంది. అయితే అది బైటికి పొక్కనీయడు.

రవీంద్ర మంచి మాటకారికావడం, అతని వృత్తికి అదో ప్లస్ పాయింటయ్యిందనే చెప్పాలి. అందుకే అతని ప్రాక్టీసు, మూడు పువ్వులూ, ఆరుకాయలుగా అభివృద్ధిచెందింది. తక్కువ వ్యవధిలోనే రవీంద్ర, లాయరుగా పేరు ప్రఖ్యాతులు సంపాదంచడమేకాదు – సీనియర్ లాయర్ల మెప్పుకోలునీ అందుకున్నాడు.

రాఘవ మనస్తత్వం, రవీంద్రకి భిన్నమైనది. రవీంద్రకి వున్నంత ప్రాక్టీసు అతనికి లేదు. రవీంద్ర సాధించినన్ని విజయాలూ అతనికి లేవు.

స్నేహితుడి విజయాలకు ఆనందించడానికి బదులు అసూయపడ్డాడు రాఘవ. అతనిలో చోటుచేసుకున్న అసూయ అనలమై జ్వలించింది. రవీంద్ర విజయాలు తన వృత్తికి విఘాతాలవుతాయేమోనన్న ఓ విధమైన భయం, కంగారు అతనిలో ఆవరించాయి. అతనిలోని స్వార్థం వొళ్ళు విరుచుకుని మేల్కొంది.

"ఒరేయ్ రవీంద్రా లాయరుగా నువ్వు సాధించిన విజయాలకి నేను ఎంతో ఆనందిస్తున్నాను. ఓ సన్నిహిత స్నేహితుడిగా గర్వపడుతున్నాను కూడా



# నెహ్రూ వేసిన జోకు

జవహర్‌లాల్ నెహ్రూ పాలనా విషయాల్లో ఎంత సీరియస్‌గా వుంటారో మామూలు విషయాల్లో అంత సరదాగా వుంటారు. 1958లో అంచలా కంటోన్మెంట్‌లో ఆయన గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు అభిమానులు. అదేమో బఫే (సెల్ఫ్ సర్వీస్ పార్టీ) పార్టీ. పార్టీ జోరుగా మొదలైంది. వొకాయన అదేపనిగా ఎగబడిపోయి ప్లేటు నిండి పొంగిపొర్లేలా చికెన్ ముక్కలు వేసేసుకుని ఆదరాబాదరా తింటూన్నాడు. ఆ దృశ్యం నెహ్రూ కంటపడింది. నెహ్రూ అటు నడవసాగాడు. అందరి కళ్ళు అటే తిరిగాయి. సదరు తిండిపోతు తిమ్మన్న దగ్గరకెళ్ళి ఏం నాయనా అంత కంగారు. నీ పేట్లో వున్నది చచ్చిన కోడే ఎటూ తప్పించుకోలేదులే అన్నాడు. ఆయన మాటలకు నవ్వులు వువ్వుల్లా కురిశాయి.




అందుకే ఈ శుభ సందర్భంలో నీకో మంచి పార్టీ ఇవ్వాలనుకుంటున్నాను. ఈ రోజు సాయంత్రం 'మానస' బార్‌కి వెళ్దాంరా. నువ్వు ఇంట్లోనే వుండు. నేనొస్తాను" అన్నాడోరోజు రాఘవ.

రవీంద్ర అదోలా మొహం పెట్టాడు. "రాఘవా నీ అభిమానానికి ధన్యవాదాలురా. పార్టీ ఇవ్వాలంటే 'బార్'కే వెళ్లనవసరంలేదు మంచి హోటలుకి వెళ్ళి రుచికరమైన భోజనం చేద్దాంరా" అన్నాడు రవీంద్ర.

రాఘవ మెల్లగా నవ్వేడు. "అడపా దడపా మనం హోటళ్ళకి వెళ్తూనే వున్నాం కదరా. అందులో ప్రత్యేకత ఏముందని? అది రొటీన్ విషయమే. 'బార్'కి వెళ్ళడంలో ఓ ప్రత్యేకత వుంటుందిరా. ఇటువంటి పార్టీలు 'బార్'లోనే జరుగుతూ వుంటాయి. ఇక నువ్వేం అడ్డు చెప్పకురా. నా సరదాని చంపేయకు" అన్నాడు రెట్టించిన వుత్సుకతతో.

రవీంద్ర కాదనలేకపోయాడు. స్నేహితుణ్ణి నొప్పించడం ఇష్టం లేకపోయింది. ఎంతో అభిమానంతో వాడలా ఆహ్వానిస్తూ వుంటే నిరాకరించడం సభ్యతగా వుండదేమోననిపించింది.

"సరేలేరా! సాయంత్రం ఆరుగంటలకి మా ఇంటికిరా. అక్కణ్ణించే వెళ్దాం" అన్నాడు రవీంద్ర.

రాఘవ మోహంలో ప్రసన్నత చోటుచేసుకుంది.

"హమ్మయ్య! నిన్ను ఒప్పించేసరికి నా తలప్రాణం తోకకొచ్చిందిరా! అయినా నువ్వు మరీ ఛాందసంగా వుండకూడదురా రవీంద్రా. కాలానుగుణంగా మనం మారాలి. ఆధునికత మనలో చోటు చేసుకోవాలి. మరి నేను వస్తారా. సరిగ్గా ఆరింటికి వస్తాను" అంటూ హుషారుగా నిష్క్రమించాడు రాఘవ.

రవీంద్ర ఇంటిముఖం పట్టాడు.

** ** **

రవీంద్ర, రాఘవ 'మానస' బార్‌కి వెళ్ళారు. అక్కడి వాతావరణం రవీంద్రకి కొత్తలా వుంది. ముళ్ళమీద కూచున్నట్టే కూచున్నాడు. రాఘవకి అక్కడి వ్యక్తులతో పరిచయాలుండటాన్ని గమనించాడు రవీంద్ర.

రాఘవ విస్కీ, సోడా తెప్పించాడు. బిరియానీ, చికెన్‌ఫ్రై ప్లేట్లు వాళ్ళ టేబిల్ మీదికి వచ్చేశాయి.

అలవాటు వున్నవాడిలానే రాఘవ విస్కీ సేవిస్తున్నాడు. అయితే రవీంద్ర మాత్రం ఎక్కువ సోడా కలిపిన విస్కీని అతి కష్టంమీద తీసుకోగలుగుతున్నాడు. రెండు పెగ్గులు తాగేసరికి రవీంద్రకి కిక్కిచ్చింది. ఏదో మరోలోకంలో వున్నట్టు అనిపించిందతనికి. అతని కళ్ళల్లోనూ, మొహంలోనూ మార్పు వచ్చింది. ప్రక్కనే వున్న బిరియానీ, చికెన్‌ఫ్రై ప్లేట్లు ఖాళీ చేశాడు. రవీంద్ర ఇల్లు చేరాక భర్త పరిస్థితి చూసి బాధపడింది అతని భార్య రమ.

> దాగుడుమూతలు సినిమాలో శారద, పద్మనాభం కలిసి సూర్యకాంతం జ్వరాన్ని కొలిచేటప్పుడు డైలాగ్
>
> అమ్మడు : (శారద) అమ్మబాబోయ్ బెజవాడంత వచ్చేసింది.
>
> సూరమ్మ : (సూర్యకాంతం) బెజవాడేంటే?
>
> అమ్మడు : అవునత్తయ్యా 118 డిగ్రీలుంది.
>
> సూరమ్మ : అమ్మో అయిసు – బాబో అయిసు అయినా 118 డిగ్రీలుంటే మనుషులు బతుకుతారటే
>
> అమ్మడు : బెజవాడలో మనుషులు బ్రతకడం లేదా?

ఏదో పార్టీ జరిగి వుంటుందని సమాధానపడింది.

రాఘవ స్వంత డబ్బులు ఖర్చుపెట్టి ఆ ఒక్క రోజే రవీంద్రకి పార్టీ ఇవ్వడం కాదు. రోజూ రవీంద్ర ఇంటికొచ్చి తీసుకెళ్ళి స్వంత డబ్బుతో రవీంద్రకి పార్టీలు ఇచ్చి అతణ్ణి బార్‌కి బానిసగా మార్చేశాడు. రవీంద్ర ఇప్పుడు బార్‌కి రాకుండా వుండలేకపోతున్నాడు. తాను మద్యానికి దాసుడై పతనమైపోతున్నాడన్న నిజాన్ని గ్రహించలేకపోయాడు రవీంద్ర. ఆ వ్యసనం అటువంటిది మరి.

హఠాత్తుగా భర్త మత్తుమందుకి బానిస కావడం చూసిన రమ ఆందోళన చెందింది. భయంతో కృంగిపోయింది.

"ఇదేవిటండీ ఎప్పుడూ లేనిది కొత్తగా ఈ అలవాటుకి బానిస అవుతున్నారు? ఈ మత్తుమందు అలవాటు మహాదారుణమైనదండీ. మొక్కగా వున్నప్పుడే ఈ వ్యసనాన్ని పీకి పారెయ్యాలండీ. నామాట వినండి. అబ్బాయి మొహం చూసి అయినా ఈ వ్యసనానికి దూరమవ్వండీ" అంది కంటతడి పెట్టుకుంటూనే.

రవీంద్ర పొడిగా నవ్వేడు. "పొరబడుతున్నావు రమా. ఈ మత్తుమందుకి నేను బానిసనవ్వలేదు. రోజంతా శ్రమిస్తున్నానుకదా. ఆ శ్రమని మర్చిపోడానికీ, ప్రశాంతంగా నిద్రపోడానికి మాత్రమే ఈ మందు సేవిస్తున్నాను. నేటి నాగరికతకు ఇదో చిహ్నం" అన్నాడు రవీంద్ర తాను చేస్తున్న తప్పుని సమర్థించుకుంటూ.

రమ కంటతడిపెట్టుకుంది. "ఏమోనండీ. నాకు భయంగా వుంది. మీరు చదువుకున్నవారు. అదీలా చదువుకున్నవారు. మీకు నేను చెప్పవల్సినదాన్ని కాను. మీరే ఆలోచించండి. ఒహరికి చెప్పవల్సినవారు మీరు. మరొకరిచేత చెప్పించుకోకండి. ఈ వ్యసనం మానండీ" రుద్ధస్వరంతో అంది.

"మరీ నస పెట్టకు రమా. ఏది మంచో, ఏది చెడో నాకు బాగా తెలుసు" విసుగ్గా అన్నాడు రవీంద్ర.

రమ మరేమీ మాట్లాడలేదు. కళ్ళొత్తుకుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

** ** **

రోజులు కాలగర్భంలో కలసిపోతున్నాయ్. రాఘవ వూహించినట్టే రవీంద్ర ప్రాక్టీస్ తగ్గింది. రవీంద్ర చేపట్టిన కొన్ని కేసులు వీగిపోయినై. కొత్త కేసులు రావడంలేదు. దీనివల్ల లాభం పొందాడు రాఘవే. పరిస్థితుల్ని తనకి అనుకూలంగా మలచుకున్నాడు

రాఘవ. ఇప్పుడో బిజీ లాయరు. తాను అనుకున్నది సాధించినందుకు వుప్పొంగిపోయాడు రాఘవ. అతనిలోని స్వార్థం సగర్వంగా నవ్వుకుంది.

** ** **

రవీంద్ర ఇలా మారిపోయినందుకు సీనియర్ న్యాయవాదులు ఎంతగానో బాధపడ్డారు. ఎంతో అభివృద్ధిలోకి రావల్సినవాడు ఇలా అథఃపాతాళానికి దిగజారుతాడని ఎవరు వూహిస్తారు.

శ్రీనివాసరావు మరీ బాధపడ్డాడు. రవీంద్ర గొప్ప భవిష్యత్తుగల లాయరుకాగలడని మొదట్లో వూహించుకున్నాడు. తన వూహ తప్పవుతున్నందుకు చింతించాడు. రవీంద్రతో ఓసారి మాట్లాడాలనుకున్నాడు. అతనితో మాట్లాడే ముందు అతని సన్నిహిత స్నేహితుడు రాఘవతో సంప్రదించాడు.

“ఏమిటి రాఘవా రవీంద్ర మద్యానికి బానిసవుతున్నాడని విన్నాను. నిజమేనా?” అడిగాడు శ్రీనివాసరావు.

రాఘవ బాధగా ఓ నిశ్వాసం వదిలాడు. “నిజమేసార్. ఏ దురలవాటూ లేని రవీంద్రకి ఈ మద్యం అలవాటు ఎట్లా వచ్చిందో నాకూ అర్థం కాలేదు సార్. ఆవేదనతో నా హృదయం మూలుగుతోంది. రెండు మూడుసార్లు చెప్పి చూశాను కూడా. కాని నా మాట వినే స్థితిలో లేడు” అన్నాడు రాఘవ.

రాఘవే రవీంద్ర పతనానికి కారకుడని. ఒక పథకం ప్రకారం అతణ్ణి ఆ రొంపిలోకి దింపినవాడు రాఘవేనని శ్రీనివాసరావుకి తెలీదు. “రవీంద్ర ఇలా మారినందుకు నేను ఎంతో చింతిస్తున్నాను రాఘవా. అతడికి ఆప్తుడివి, సన్నిహిత స్నేహితుడివి నువ్వే. నువ్వు చెప్పినా అతను వినిపించుకోవడంలేదంటే ఇంక ఎవరేం చెయ్యగలరు. ఎంతో అభివృద్ధిలోకి వచ్చి ప్రతిభగల లాయరుగా పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తాడనుకున్న రవీంద్ర హఠాత్తుగా ఇలా తయారవ్వడం నా గుండెని రగిల్చేస్తోంది. ఓసారి రవీంద్రని నన్ను కలియమను. నేను చెప్పి చూస్తాను” అన్నాడు శ్రీనివాసరావు.

రాఘవ మొహం వెలవెలబోయింది. శ్రీనివాసరావుగారు కలిగించుకుంటే రవీంద్ర మళ్ళీ మామూలు మనిషిగా మారిపోతాడేమోన్న భయం అతణ్ణి ఆవరించింది. అలా జరగకూడదనుకున్నాడు.

“వద్దు సార్. మీరు కలిగించుకోకండి. పెద్దవారు. సంఘంలో మీకో స్థానం వుంది. అటువంటి మిమ్మల్ని వాడు అవమానిస్తే అది మీకేకాదు. మా అందరికీ బాధ కలిగిస్తుంది” అన్నాడు రాఘవ.

రాఘవ మాటలు యథార్థమనే నమ్మేశాడు శ్రీనివాసరావు, వాళ్ళిద్దరి స్నేహం దృష్ట్యా.

“అలాగా! అయితే వద్దు. నువ్వే మరో మారు ప్రయత్నించు” అన్నాడు శ్రీనివాసరావు.

రాఘవ వూపిరిపీల్చుకున్నాడు. అతని హృదయం కుదుటపడింది.

“అలాగే సార్. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. రవీంద్రని మళ్ళీ మామూలు మనిషిని చేస్తాను” అన్నాడు రాఘవ శపథం చేస్తున్నట్టు.

శ్రీనివాసరావు నమ్మకేం జేస్తాడు? “సరే నువ్వెళ్ళు” అన్నాడు. రాఘవ వెళ్ళిపోయాడు.

** ** **

### పద్య ఫైటింగ్

సాహిత్య పోరాటాలలో సైతం సృజనాత్మకత వెల్లివిరిస్తుంది. తనతో సాహిత్య పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుస్తూ దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు ఇలా ఆహ్వానించారట “రంగము మీద కెక్కుదు మురా! మరి కావ్యము సేయ వొర్తువో! ఇంగున వొక్క పద్యము సుఖంబుగ పాడగ నేర్తువో! రసాభంగుర భంగి అర్ధపరి పాటివ చింతువో లోక తత్వపారంగ తులైన సభ్యుల వురాయని మెచ్చ మనన్యసంతువో! రంగము మీద కెక్కుదము రా... ఎగిరి వెక్కిరించి ఇగిలిగించుకొన్నట్లు కావ్యకవుల తోడి కతలు వెతలు కవుల జనక మారక యపోవునా? అది కుమ్మరడను కాదు కమ్మరడును.

‘బాపూ రమణీయం’

రవీంద్ర ఇప్పుడు పూర్తిగా మద్యానికి బానిసయ్యాడు. ఒక్కొక్కప్పుడు అతను కోర్టుక్కూడా వెళ్ళడంలేదు. అక్కణ్ణించి అతని కష్టాలు ఆరంభమయ్యాయి.

రవీంద్ర భార్య రమ ఎంత చెప్పినా, రోదించి ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. అవమానించబడింది. భర్తచేత దెబ్బలుతింది. అన్నింటినీ భరిస్తున్నదేగాని రవీంద్రలో మార్పు రాలేదు. అతని ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. ఓరోజు రాత్రి నిద్రలోనే కన్నుమూశాడు రవీంద్ర. అతని జీవితం ఇలా సమాప్తమయ్యింది.

స్వార్థపరుడు రాఘవ లోలోన సంతోషించాడు.

రమ ఆవేదనకి అంతం లేదు. ఆమె బతుకే అంధకారమయ్యింది. కొడుకుని అక్కున జేర్చుకుని భర్త భౌతికకాయమ్మీద పడి బావురుమనడం తప్పించి ఇంకేమీ చెయ్యలేకపోయింది. ఆమెని ఆ స్థితిలో చూసినవాళ్ళందరి గుండెలు చెరువులే అయినయ్.

రవీంద్ర బంధువులూ, స్నేహితులూ చాలామంది వచ్చారు. సానుభూతి చూపారు. వారిలో రాఘవ కూడా వున్నాడు. రవీంద్ర భౌతికకాయానికి అంత్య క్రియలు జరిపించారు. రాఘవ భార్య పరిమళ రమని ఓదారుస్తోంది. శ్రీనివాసరావు రమ ఆవేదనని చూడలేకపోయాడు.

“అమ్మా రమా నీకూ, అబ్బాయికీ తీరని అన్యాయం జరిగిందమ్మా. రవీంద్ర ఎంతో అభివృద్ధిలోకి వస్తాడని, నాకు పేరుతెస్తాడని భావించాను. కాని దురదృష్టవశాత్తు మత్తుమందుకి బానిసై తన భవిష్యత్తుని చీకటిమయం చేసుకుని, తానూ శాశ్వతంగా చీకట్లో కలిసిపోయాడు” అన్నాడు బొంగురుపోయిన స్వరంతో శ్రీనివాసరావు.

రమకి దుఃఖం వెల్లువలా పెల్లుబుక్కొచ్చింది.

“అది నా దురదృష్టం బాబాయ్‌గారూ. ఆయన అభివృద్ధికోసం నేనూ ఎన్నో కలలుగన్నాను. కాని ... కాని ... కంచే చేనుమేస్తే ఎవరేం చెయ్యగలరు సార్. ఆత్మీయులే అపకారం తలపెడితే ఇంక రక్షించేదెవరు చెప్పండి” బావురుమంటూ అంది రమ.

శ్రీనివాసరావుకే కాదు – అక్కడున్నవాళ్ళెవ్వరికీ ఆమె మాటల సారాంశం అర్థం కాలేదు. ఒక్క రాఘవకి తప్ప.

“ఏమిటమ్మా నువ్వంటున్నది” విభ్రాంతపోతూ ప్రశ్నించాడు శ్రీనివాసరావు.

అందరూ ఆసక్తిగా రమకేసే చూస్తున్నారు. రాఘవ మొహం వివర్ణమయ్యింది. రమ ఏం చెబుతుందోనని కలవరపడ్డాడు.

రమ వెక్కివెక్కి ఏడుస్తూ “ఔను బాబాయ్ గారూ! మా వారికి సన్నిహిత మిత్రులనుకున్న రాఘవ అన్నయ్యగారే మావారి పతనానికీ, మా కుటుంబ వినాశనానికీ కారకుడవుతారంటే ఎవరు నమ్ముతారు చెప్పండి” రుద్ధస్వరంతోనే అంది రమ.

అక్కడున్నవాళ్ళందరి దృష్టీ రాఘవపై కేంద్రీకరించింది. కంగారుపడ్డాడు రాఘవ. తనని తాను రక్షించుకోవాలనుకున్నాడు.

“ఏమిటమ్మా చెల్లాయ్. నన్నే నిందిస్తున్నావు? నామీద ఇటువంటి అభాండం వేసేముందు రవీంద్రకి నేనెంత సన్నిహితుణ్ణో మర్చిపోకమ్మా” అన్నాడు రాఘవ. అయితే, అతని మాటల్లో కాస్తంత తొట్రుబాటు ధ్వనిస్తోంది.

రమ రాఘవకేసి తీక్షణంగా చూసింది. ఆమెలో అగ్నిపర్వతం బద్దలయ్యింది. అంతరాళం నుంచి లావా చిమ్మింది. మనసులో రగులుతున్న రహస్య జ్వాలని దాచుకోలేకపోయింది. ఆమె కళ్ళు వింత నిప్పుల్లా మెరుస్తున్నాయి. “సన్నిహిత స్నేహితులా మీరు. ఒకప్పుడు అయ్యుండొచ్చు అన్నయ్యగారూ. మిమ్మల్ని ‘అన్నయ్య’ అని సంబోధించడానికే నా మనసు అంగీకరించడంలేదు. కానీ ... కాని ...



ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక
1997 దీపావళి
ప్రత్యేక సంచిక

ఇప్పుడు మాత్రం మీరాయనకి సన్నిహితులు కారు. మిత్రద్రోహులు. స్నేహానికే కళంకం తెచ్చిన కపట స్నేహితులు. మావారి ప్రాక్టీసు వుంజుకుని ఆయన ఎన్నో విజయాలు సాధించి, నలుగురిచేత 'శభాష్' అనిపించుకుంటోన్న తరుణంలో మీ స్వార్ధంతో ఆయన్ని బార్‌కి తీసుకువెళ్ళి స్వంత డబ్బు ఖర్చుబెట్టి ప్రథమంగా మందు రుచి చూపించింది మీరు కాదూ. ఒక్కరోజుతోసరిపోయిందా? రోజూ ఆయనచేత తాగించి, ఆ వ్యసనానికి ఆయన్ని బాని సగా మార్చింది మీరుకాదూ? ఆయన ప్రాక్టీసు సలుచబడితే మీకు లాభిస్తుందని స్వార్ధంతో ఈ నీచపనికి పూనుకున్నారు. చివరికి ఆయన ప్రాణాలకే ముప్పుతెచ్చి ఆయనకీ, మా కుటుంబానికీ ద్రోహం చేశారు. మేకతోలు కప్పుకున్న పులిలాంటి వ్యక్తులు మీరు. మీ మొహం చూస్తేనే పాపం. మీరు చేసిన ఈ ఘాతుకానికి భగవంతుడే మీకు శిక్ష విధిస్తాడు. వెళ్ళండి. నా కళ్ళముందునుంచి వెళ్ళండి" రోదిస్తూనే ఆవేశంగా అంది రమ.

రాఘవ గురించి అక్కడున్నవాళ్ళంతా గుసగుస లాడుకున్నారు. అతనికేసి అసహ్యంగా చూశారు. ఏవగింపుతో ఛీత్కరించారు. వారిలో శ్రీనివాస రావూ వున్నాడు. రాఘవకేసి తీక్షణంగా చూసి రమకేసి తిరిగాడు.

"తాత్కాలికంగా ఎవరు లాభం పొందినా భగ వంతుడనేవాడు పైన వున్నాడమ్మా. నువ్వేం దిగులుపడకు. నీ వెనక మేం వున్నాం. మళ్ళీ వస్తానమ్మా" బయల్దేరాడు శ్రీనివాసరావు.

రాఘవ శ్రీనివాసరావుకి దగ్గరగావెళ్ళి "సార్, నన్ను అపార్ధం చేసుకోకండి ... ప్లీజ్" అని ఇంకేదో చెప్పబోయాడు.

శ్రీనివాసరావు అతనికేసి ఏహ్యాభావంతో చూశాడు. "మరేం చెప్పొద్దు రాఘవా. నువ్వు స్వార్ధపరుడవని నాకు ఎప్పుడో తెలుసుగాని. మరీ ఇంత స్వార్ధపరుడివని తెలీదు" విసురుగా అంటూ కళ్ళొత్తుకుంటూ నిష్క్రమించాడు శ్రీనివాసరావు.

రమ పక్కనే వున్న రాఘవ భార్య పరిమళకి తలకొట్టేసినంత పనయ్యింది. భర్త అసలుస్వ రూపం ఇప్పుడు అర్ధమయ్యింది. తన స్వార్ధంకోసం భర్త ఎటువంటి నీచానికయినా దిగజారిపోతా డన్న నిజాన్ని ఇప్పుడు తెలుసుకుంది. భర్తపట్ల జుగుప్స కలిగింది. అటువంటి వ్యక్తి తనకి భర్త అని చెప్పుకోడానికే సిగ్గుపడాలనుకుంది. భర్తకేసి కోపంగా, వెగటుగా చూసి అక్కణ్ణించి విసురుగా బైటికి వెళ్ళిపోయింది.

రాఘవ కలవరపడ్డాడు. అతనికి తెలుసు పరి మళ తనని క్షమించదని. చరచరా ఆమె వెంట నడిచాడు. భార్యని సమాధానపర్చడానికి శతవిధాల ప్రయత్నించాడు. కాని ఫలితం లేకపోయింది.

పరిమళ పుట్టింటికి వెళ్ళిపోయింది.

హతాశుడైపోయాడు రాఘవ. ఏం సాధించాడు తను? ... తనలో తనే ప్రశ్నించుకున్నాడు. అతని కళ్ళు వర్షించినయ్.

### చమత్కారిక

మీరు కొత్త దంపతులా!
అయితే కొంత కాలం
నిరోద్యోగులుగా వుండాల్సిందే

THE FESTIVAL COLLECTION

FOR THE ENTIRE FAMILY

COLOUR FULL
COLLECTION
OF GARMENTS
AND TEXTILES
FOR
KIDS, LADIES & GENTS

మనోహర్
ఫ్యామిలి ఫ్యాషన్ షాప్
బీసెంట్‌రోడ్, విజయవాడ - 2
మాకు ఎక్కడా బ్రాంచీలు లేవు.

SHOP TODAY TO AVOID LAST MINUTE RUSH

TARA ◆ 2766